నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 12 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL

పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

కాంగ్రెస్ పాలనతో విసిగి..
బీఆర్ఎస్‌లోకి

● బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ● బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

భీంపూర్, ఏప్రిల్ 11 : హామీలు అమలు చేయని కాంగ్రెస్ పాలనతో విసిగి, గత కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటూ, బోథ్ నియోజకవర్గంలో ప్రగతిని చూసి కాంగ్రెస్ పార్టీ నుంచి నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. నేరడిగొండలో ఎమ్మెల్యే సమక్షంలో భీంపూర్ మండలం తాంసి(కే) గ్రామానికి చెందిన 15 మంది కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. నాయకులు కునార్పు వినోద్‌యాదవ్, భుజంగరావు, రషీద్‌ఖాన్, గంగన్న, దేవన్న సహా మరో 10 మంది కార్యకర్తలకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరెన్ని చెప్పినా ఇక రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ సర్కారేనని స్పష్టం చేశారు. బోథ్ నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని, కార్యకర్తలు పరిస్థితిలో ధైర్యం వీడకుండా నూతనోత్సాహంతో స్థానిక సమస్యల పరిష్కారంలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, మాజీ వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, నాయకులు కుడిమెత సంతోష్, మడావి లింబాజీ, ఎం. కల్చాప్ యాదవ్, అఫ్రోజ్, గోప మహేందర్, గంగయ్య, ప్రవీణ్ తదితరులున్నారు.

అడవిలో తప్పిపోయి దొరికిన మహిళలతో మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

రాత్రంతా అడవిలోనే..

తునికాకు సేకరణకు వెళ్లి తప్పిపోయిన నలుగురు మహిళలు

● ఫోన్ సిగ్నల్ ఆధారంగా డ్రోన్ కెమెరాలతో ఆచూకీ గుర్తింపు
● మహిళలను సురక్షితంగా తీసుకువచ్చిన పోలీసులు

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 11 : అడవిలో తునికాకు సేకరణకు వెళ్లి దారి తప్పిపోయి నలుగురు మహిళలు రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు. కారడవిలో నలుగురు మహిళలు దారితప్పి తప్పిపోగా జిల్లా పోలీసులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో మహిళల ఆచూకీ కనుగొనడంతో ఉత్కంఠకు తెరపడింది. వివరాల్లో కెళ్తే నిర్మల్ జిల్లా మామడ మండలం కప్పనపల్లికి చెందిన నలుగురు మహిళలు రాజుల రాధ, కంబాల లింగవ్వ, గట్లమీది లక్ష్మి, బత్తుల సరోజ తునికాకు సేకరణకు గ్రామ శివారులోని దట్టమైన అడవికి గురువారం సాయంత్రం వెళ్లారు. చీకటి పడడంతో దారి తప్పిపోయారు. మహిళలు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. గ్రామస్తుల సాయంతో అడవిలో ఎంత వెతికినా జాడ దొరకలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ డా.జానకీషర్మిల, ఏఎస్పీ రాజేశ్‌మీనాతో మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు రెస్క్యూ ఆపరేషన్ చేసి అడవిలో గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు ఆరు గంటల పాటు పోలీసులు అడవిని జల్లెడ పట్టారు. ఇద్దరి మహిళల వద్ద సెల్‌ఫోన్లు ఉన్నప్పటికీ నెట్‌వర్క్ సిగ్నల్ లేదు. అర్ధరాత్రి తర్వాత ఓ ఫోన్‌కు సిగ్నల్ రావడంతో దాని ఆధారంగా ట్రాకింగ్ చేసి, డ్రోన్ కెమెరాలతో గాలించారు. చివరికి భీమన్న గుట్టపై మహిళల ఆచూకీని గుర్తించారు. వారిని శుక్రవారం ఉదయం పోలీసులు సురక్షితంగా గ్రామానికి తీసుకువచ్చారు. జిల్లా ఎస్పీ, అధికారులు, సిబ్బందిపై గ్రామస్తులు పూలు చల్లుతూ అభినందిస్తూ గ్రామంలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామస్తులు అటవీ ప్రాంతాలకు వెళ్లే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆపద సమయాల్లో పోలీసులకు సమాచారం అందించాలని, ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ ఆపరేషన్‌లో ఎస్పీ జానకీ షర్మిలతో పాటు ఏఎస్పీ రాజేశ్‌మీనా, ఇన్‌స్పెక్టర్లు గోవర్ధన్‌రెడ్డి, ఆర్ఐలు శేఖర్, రమేశ్, ఎస్ఐలు ఆర్ఏసీలు, ఉమెన్ స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లా తాండూర్‌లో పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు(ఫైల్)

పత్తి రైతుపై నకిలీ కత్తి

ఉమ్మడి జిల్లాలో జోరుగా గ్లైసిల్ విత్తనాల దందా

- సీజన్‌కు ముందే పల్లెలకు సరఫరా
- దళారులే సూత్రధారులు..
- రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని సొమ్ము చేసుకుంటున్న వైనం
- రంగంలోకి అధికార పార్టీ లీడర్లు సైతం
- ఇప్పటికే పలుచోట్ల నకిలీ పత్తివిత్తనాలు పట్టివేత
- అధికారుల అండదండలు.. అదుపుచేయడంలో విఫలం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పత్తి రైతుపైకి 'నకిలీ' కత్తి దూసుకొస్తున్నది. సీజన్‌కంటే ముందే గ్లైసిల్ పత్తి విత్తనాల దందా జోరుగా సాగుతున్నది. దళారులు పలు ప్రాంతాల నుంచి తీసుకొచ్చి అమాయక రైతులకు అంటగడుతూ అందినకాడికి దండుకుంటుండగా, యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరించడం ఆందోళన కలిగిస్తున్నది.

మంచిర్యాల జిల్లా తాండూర్‌లో పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు(ఫైల్)

మంచిర్యాల, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా తాండూర్‌తో పాటు కన్నెపల్లి, భీమిని, నెన్నెల, చెన్నూర్ రూరల్, జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేటతో పాటు ఆసిఫాబాద్ జిల్లాలోని దహెగాం, కాగజ్‌నగర్, చింతలమానేపల్లి, సిర్పూర్, బెజ్జూర్ మండలాలకు గ్లైసిల్ పత్తి విత్తనాలు సరఫరా అయ్యాయి. ఇటీవల ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలో ఇటీవల రూ.10.50 లక్షల విలువైన మూడు క్వింటాళ్లు, మార్చి నెలాఖరున మంచిర్యాల జిల్లా తాండూర్‌లో రూ.6.17 లక్షలు విలువైన 247 కిలోల పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. అంతకుముందు కర్ణాటక నుంచి మంచిర్యాలకు డీసీఎంలో తీసుకొస్తున్న 37.5 క్వింటాళ్ల పత్తి విత్తనాలను శామీర్‌పేట్ ఓఆర్ఆర్ సమీపంలో స్వాధీనం చేసుకోగా, దందా ఏ మేరకు సాగుతున్నదో అర్థమవుతున్నది.

దళారులే సూత్రధారులు..

రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా భీమిని, కన్నెపల్లి, బెల్లంపల్లి, చెన్నూర్, కాగజ్‌నగర్ ప్రాంతాలకు ఏపీ నుంచి వలసవచ్చే దళారులు స్థానికంగా ఉంటూ రైతులతో పరిచయాలు పెంచుకుంటున్నారు. ఇక్కడ భూమిని కౌలు చేయడమో లేదా తోటలు లీజ్ తీసుకోవడమో చేసి రైతులను ఆకర్షిస్తున్నారు. పత్తులు విత్తే సమయానికి విత్తనాలు తీసుకురావడం కష్టమని, ముందుగానే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లోనే గ్రామీణ ప్రాంతాలను వాటిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో పట్టుబడే విత్తనాలు కొద్ది మొత్తంలో ఉంటే, గుట్టుచప్పుడు కాకుండా గమ్యం చేరుతున్న విత్తనాలు పెద్ద మొత్తంలో ఉంటున్నాయి. మహారాష్ట్ర సరిహద్దులో ఉండే మండలాల్లో ఇప్పటికే గ్లైసిల్ విత్తనాలను డంప్‌ల కొద్ది స్టోర్ చేసినట్లు తెలుస్తున్నది. బెల్లంపల్లిలోని ఓ వ్యాపారి ఈ గ్లైసిల్ విత్తనాలు అమ్ముతున్నాడు. ఆయనే భీమిని, నెన్నల, దహెగాం తదితర ప్రాంతాల్లోని చిన్న వ్యాపారులకు వీటిని పంపిస్తున్నాడు. తాండూరు మండలంలో సైతం ఓ వ్యాపారి ఈ గ్లైసిల్ విత్తనాల వ్యాపారం చేస్తున్నారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి సైతం మంచిర్యాల జిల్లాలోని కొన్ని మండలాల్లో ఈ దందా చేస్తున్నారు. గతంలో ఈ వ్యవహారంలో దొరికినా ఆయన మళ్లీ అవే విత్తనాలు అమ్ముతున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో పని చేస్తున్న ఓ ప్రభుత్వ టీచర్ గతంలో మంచిర్యాలలో పని చేశారు. ఆయన తన పరిచయాలను ఉపయోగించి నకిలీ విత్తనాల రాకెట్‌ను నడిపిస్తున్నట్లు తెలిసింది. గతంలో ఓ సారి పీడీ యాక్ట్ కేసు నమోదైనప్పటికీ ఈ సారి ఆయన వెనక్కి తగ్గడం లేదని సమాచారం.

రంగంలోకి అధికార పార్టీ లీడర్లు..

గ్లైసిల్ పత్తి విత్తనాల దందాను అధికార పార్టీ లీడర్లు అద్భుతంగా వాడుకుంటున్నారు. లక్షెట్టిపేట మండలంలో ఓ గ్రామ మాజీ సర్పంచ్‌గా చేసిన వ్యక్తి లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల్లోని అన్ని గ్రామాలకు నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేస్తున్నారు. మందమర్రిలో అధికార పార్టీ నాయకుడు జిల్లాలో దందాకు కేంద్ర బిందువుగా వ్యవహరిస్తున్నారు. మిగిలిన మండలాల్లోని అధికార పార్టీ నాయకులు పత్తి విత్తనాల దందాలో దూసుకుపోతున్నారు. విత్తనాలు వస్తున్నాయంటే ముందే పోలీసు శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులకు మామూళ్లు వెళ్లిపోతున్నాయన్న ఆరోపణలున్నాయి. మండలం, అక్కడ ఉన్న వ్యవసాయ భూముల లెక్కల ఆధారంగా అధికారులకు డబ్బులు అప్పగిస్తున్నట్లు తెలుస్తున్నది. గతేడాది రూ.80వేలు ఇచ్చారని ఈ సారి ఎక్కువ మొత్తం వస్తుందంటూ వ్యవసాయ శాఖలో పని చేసే ఓ అధికారి ఆయన సన్నిహితుల దగ్గర చెప్పుకొచ్చారు. విత్తనాల దందా కాసులు కురిపిస్తుండడంతో అధికారులు సైతం మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భీమిని మండలంలో ఉండే ఆంధ్రా ప్రాంతానికి చెందిన దళారుల సాయంతో గతేడాది గ్లైసిల్ విత్తనాల దందా చేసిన ఓ లీడర్ ఈ సారి తన హవాను కొనసాగిస్తున్నారు. అధికార పార్టీ లీడర్లు అన్నింటికీ ముందు పడుతుండడంతో నకిలీ దందా మూడు పూలు.. ఆరు కాయలుగా సాగుతున్నది. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి చేతులు మారుతూ నకిలీ పత్తి విత్తనాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోకి వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు నకిలీ విత్తనాలను అరికట్టే దిశగా కఠిన చర్యలు తీసుకుంటారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉన్నది.

అదుపుచేయడంలో విఫలం

అంతకుముందు ఏడాది దాదాపు 60 శాతం మంది రైతులు గ్లైసిల్ విత్తనాలతో సాగు చేశారు. సాధారణంగా ప్రభుత్వ ఆమోదిత పత్తి విత్తనాలైతే కలుపు ఎక్కువగా ఉంటుంది. అదే గ్లైసిల్ పత్తి విత్తనాలైతే గడ్డి పెరగదు. కలుపు కష్టం లేకుండానే మంచి దిగుబడి వస్తుందని రైతులు వీటిపైపు మొగ్గు చూపుతున్నారు. గ్లైసిల్ విత్తనాలు పర్యావరణానికి హానికరం. వాటిని వేస్తే నేల నిస్సారం అవుతుంది. దీర్ఘకాలంలో అది భూమిపై ప్రభావం చూపిస్తుంది. ఈ విషయాలన్నీ రైతులకు వివరించడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో గడిచిన ఐదేళ్లుగా నకిలీ విత్తనాల సమస్య పెరిగిపోతూనే ఉంది. యేటా కోట్ల రూపాయలు చేతులు మారే ఈ నిషేధిత గ్లైసిల్ పత్తి విత్తనాల రాకెట్‌ను అదుపుచేయడంలో అధికారులు ఘోరంగా విఫలం అవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేరడిగొండలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు, నాయకులు

ఆదర్శనీయుడు జ్యోతిబాపూలే

● బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ● ఆదిలాబాద్, నిర్మల్‌లో ఘనంగా జయంతి వేడుకలు

నేరడిగొండ, ఏప్రిల్ 11 : అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యాభివృద్ధి కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప ఆదర్శ ప్రాయుడు, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబాపూలే అని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కొనియాడారు. శుక్రవారం నేరడిగొండలో పూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సమానత్వానికి, మహిళా విద్యకు మార్గదర్శకులు పూలే అని గుర్తు చేశారు. మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరమణ, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, నాయకులు సంతోష్‌సింగ్, రాజశేఖర్, లస్మన్న, ప్రతాప్‌సింగ్, బాబులాల్ తదితరులున్నారు.

మహిళల విద్య కోసం ఏనలేని కృషి

ఎదులాపురం, ఏప్రిల్11: ఆడ పిల్లల చదువు కోసం పూలే దంపతులు ఏనలేని కృషి చేశారని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని బీసీ స్టడీ సర్కిల్ ఆవరణలోని పూలే విగ్రహానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సత్యశోధక్ సమాజ్ పేరిట సొసైటీ ఏర్పాటు చేసి హక్కుల కోసం పోరాటాలు చేశారన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..మహిళలు చదువుకుంటేనే సమాజాభివృద్ధి సాధ్యమని తెలిపారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి రాజలింగు, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, బీసీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కల దత్తు, శ్రీనివాస్, అశోక్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జడ్పీ సమావేశ మందిరంలో..

ఆదిలాబాద్ జడ్పీ సమావేశ మందిరంలో బీసీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అధికారిక జయంతి వేడుకల్లో కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సంస్కృతి కళాకారులు జ్యోతిబాపూలేను కీర్తిస్తూ పాటలు పాడారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి రాజలింగు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిర్మల్ కలెక్టరేట్‌లో..

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 11 : నిర్మల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో జ్యోతిబాపూలే చిత్రపటానికి అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో అస్పృశ్యత, అంటరానితనం, కుల వివక్ష లాంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించేందుకు పూలే కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి రాజేశ్వర్ గౌడ్, మైనార్టీ అధికార మోహన్ సింగ్, సీపీవో, సీపీవో జీవ రత్నం, రాంగోపాల్, నర్సింహారెడ్డి, కుల సంఘాల నాయకులు నర్సాగౌడ్, భాస్కర్, ప్రభాకర్, ముడుసు సత్యనారాయణ ఉన్నారు.

రజతోత్సవ సభపై విస్తృత ప్రచారం

విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు నాయకుల పిలుపు

భైంసా, ఏప్రిల్, 11 : ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు ముథోల్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చేలా బీఆర్ఎస్ నాయకులు రమాదేవి, విలాస్ గాదేవార్, డా. కిరణ్ కొమ్రేవార్, లోలం శ్యాంసుందర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇప్పటికే భైంసా పట్టణంతో పాటు మండలంలో సభ విజయవంతం చేయాలని కోరుతూ వాల్ రైటింగ్స్ ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలో ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు కిరణ్ కొమ్రేవార్ స్వయంగా 'కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి' గోడపై రాసి ప్రచారం చేపట్టారు.

పోస్టర్ ఆవిష్కరణ

రజతోత్సవ సభ విజయవంతం చేయడంపై శుక్రవారం భైంసా పట్టణంలోని ఎన్ఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. సభకు సంబంధించిన పోస్టర్‌ను ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు రమాదేవి, విలాస్ గాదేవార్, కిరణ్ కొమ్రేవార్, లోలం శ్యాంసుందర్, నాయకులు ఆవిష్కరించారు. బీఆర్ఎస్ నాయకులు దశరథ్, దత్తు, శ్యామ్, రాజేశ్, పోశెట్టి, అజీజ్ ఖురేషీ, వాసే, నాయకులున్నారు.

సన్నాహక సమావేశం

లోకేశ్వరం, ఏప్రిల్, 11 : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం లోకేశ్వరంలో ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. బీఆర్ఎస్ మండల సోషల్ మీడియా కన్వీనర్ బండి ప్రశాంత్, నాయకులు పాల గంగాధర్, ధర్మోరా ప్రకాశ్, భోజారెడ్డి, సుధాకర్, నగర్ మాజీ ఉప సర్పంచ్ ముసఫ, హవర్గ భోజన్న, మగ్గిడి రాజు, మాజీ ఎంపీటీసీ బండు, ఎస్టీ సెల్ కన్వీనర్ రాజుర భోజన్న, ఆనందరావు, బాబన్న, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో..

ఆదిలాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు కొండ గణేశ్, ధమ్మపాల్ కోరారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్, కొలిపూరా, పిట్టల్‌వాడ, అనుకుంట ప్రాంతాల్లో వాల్ రైటింగ్స్ ద్వారా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో దేవిదాస్, మౌర్య, సురేందర్, వసంత్, అశోక్, విఠల్, వినోద్, మహేశ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో వాల్‌రైటింగ్ ద్వారా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భైంసా : పోస్టర్ ఆవిష్కరిస్తున్న డా. కిరణ్ కొమ్రేవార్, నాయకులు